



# నింగికీ నేలకూ మధ్య...

గేటు దగ్గిర ఆగి వరలక్ష్మి ఆ మేడ పునాదుల నుంచి పైకప్పు వరకు పరిశీలించి చూసింది. గేటు మూసి ఉంది. గేటవతల మేడ చుట్టూరా మోకాలెత్తు పచ్చగడ్డి, నిక్కబొడుచుకున్న రోమాల్లా నిటారుగా నిలిచిఉంది.

పెచ్చులూడిన గోడలూ, ఏ నాటి దో వెలిసిపోయిన రంగూ, చివరికి గడ్డికూడా మొలచిన మెట్లూ, సగం జీర్ణావస్థలో ఉన్న ఆ మేడను చూచేసరికి.... అంతవరకూ అర్ధరాత్రి నిర్భయంగా రాగలిగిన వరలక్ష్మి ఎందుకో కొద్దిగా భయపడింది.

ఊరి పొలిమేరలు కావడం మూలాన, అందులోనూ నిశిరాత్రి మూలాన మనుషుల జాడలే కనిపించలేదు. వెన్నెల్లో మాత్రం స్పష్టంగా శిథిలమైన యవ్వనంతో అర్ధనగ్నంగా నిలబడ్డ స్త్రీలా ఉంది మేడ.

చివరిక్షణంలో తనను నిలకడగా పరిశీలించుకుంది వరలక్ష్మి, తనిప్పుడు చేస్తున్నది సబబా కాదా అని. తను తొక్కేపుంత మంచిదా కాదా అని. తన ప్రశ్నలకు తనే నవ్వుకుంది. అది భర్త మీద అసహ్యంతో కావచ్చు.

కృతనిశ్చయంతో గేటు తీసి చరచరా లోపలికి నడిచింది. సూరిబాబు అలిసిపోయి అమాయికంగా నిద్రిస్తుంటాడు. తట్టి భుజాలు కదిపి లేపి "సూరీ, వచ్చేసాను. నరకానికి విడాకులిచ్చి వచ్చేసాను. ఇక నేను శాశ్వతంగా నీతోనే ఉండిపోతాను" అని ఉద్వేగంతో తెలియజెప్పాలి!

మెల్లెక్కి పైకి నడిచింది. నిర్జీవంగా ఉన్న ఆ మేడలో ఆ ఒక్క గదిలోనే వెలుగు ఉంది. సూరిబాబు ఒంటరితనం తప్ప అక్కడ నరసంచారం లేదు.

గది తలుపులు తోసింది. సూరిబాబు ఆకుపచ్చ దివాసీ మీద అరమూత కళ్ళతో నిద్రపోతున్నాడు. గుమ్మం దగ్గరే ఒక్క క్షణం ఆగిపోయింది వరలక్ష్మి. క్రొవ్వొత్తి కాంతిలో సూరిబాబు మొహం వెలిగిపోతూ ఆమెలో వ్యామోహాన్ని కలిగించింది. తన ఒడిలోకి అతని తల తీసుకుని ఆప్యాయంగా నిమిరి ముద్దు పెట్టుకోవాలనిపించింది. దగ్గరగా వెళ్ళి మోకాళ్ళమీద వంగి చెంపలమీద మెల్లగా నిమిరింది.

గబుక్కున భర్త గుర్తు వచ్చాడు. గుర్తుతోబాటు నవ్వు కూడా వచ్చింది. పాపం అతను ఆ రాత్రి కోరికలన్నీ ఒకే ఒక పశుప్రాయమైన అనుభవంతో తీర్చుకుని మామూలు మనిషయిం తర్వాత తన మీద పర్చిపోయిన అసహ్యాన్ని గుర్తు తెచ్చుకుని తనని అవతలకి తోసి, అలు పొస్తే అటు తిరిగి నిద్రపోయాడు. నిజంగా పూర్ హజ్బెండ్. ఆ క్షణాల్లో తనకు ఏడుపు రాలేదు. చిరునవ్వు వచ్చింది. వరలక్ష్మికి తన స్థితికంటే తన భర్త పరిస్థితి జాలి కలిగించింది. నరనరానికి అతనిలో పాకిపోయిన జుగుప్స, అసహ్యం ...అతనికి బొత్తిగా మనశ్శాంతి లేకుండా చేశాయి. తన విషయంలో రాజశేఖరానికి ఎందుకంత ద్వేషమో అర్థంకాలేదు.

అర్థం చేసుకునే మేధస్సు తనకు లేదని సరిపెట్టుకుని ఆఖరికి చీటీ వ్రాసి అతని పాదాల దగ్గర పెట్టి నమస్కరించ కుండా యిలా వచ్చేసింది వరలక్ష్మి.

ఎప్పటికో ఈ రాత్రి గడుస్తుంది. తెల్లవారిం తర్వాత లేచి కనులు మూసుకునే 'ఛీ నీ పాడు మొహం నాకు చూపించకు. ఏడి? దేవుడెక్కడ!' అని తడుముకుంటూ దేవుడి పటం చూసి దణ్ణం పెట్టుకుంటాడు భర్త. 'ఎక్కడ తగలడ్డావ్ దెయ్యం!' అని తన కోసం రంకెలు వేస్తాడు. యింకెక్కడ వరలక్ష్మి! అర్ధ రాత్రే వెళ్ళిపోతే! పక్కమీద ఉత్తరం చూచి గాభరాగా చదువుతాడు:

''భర్తగారూ,

మిమ్మల్నిలాగే పిలవాలనుంది.

మీరు అనుమానాగ్నిలో మాడిపోతూ, అన్యాయంగా నన్ను అవమానం చేస్తూ గడిపిన సుదీర్ఘమైన యాత్రకి ఇది ఆఖరి స్టేషను. ఇక్కడ నేను దిగిపోతున్నాను.

ఇక మీ హింసలకి టార్గెట్ మీ ఎదురుగా ఉండదు.ఇంతవరకూఎవరితో అక్రమ సంబంధాన్ని అంటగట్టారో, ఆ సూరిబాబు వెచ్చటి కౌగిట్లో కరుగుతూ ఉంటుంది.

ఒకమాట, ఇదంతా ఎలా ఆపాదించారు? చెప్పుడు మాటలువినా? లేక సొంత కళ్ళతో చూశా?

నిజమే పాపం మీ అనుమానాలకి ఆధారం ఉంది. మన పెళ్ళికి పూర్వం నేను సూరిబాబుని ప్రాణానికిమించి ప్రేమిం

చాను. నా భవిష్యజ్జీవితమంతా అతని తోడు నీడలతోనే బంగారు మలామా చేసుకోవా లనుకున్నాను. కానీ అలా జరగలేదు. మా వాళ్ళే అలా జరగనివ్వలేదు. 'సూరిబాబుకి ఆపాడు మేడతప్పఏముంది? ప్రేమ కాకుండా జీవితావసరాలు ఎన్నో ఉన్నాయి. రాజ శేఖరం చూడు. ఆ కారు....ఆ బంగళా.... ఆ హోదా....' అని ఎవరో నూరిపోసిన ప్రపంచజ్ఞానానికి నా స్వార్థం తోడయింది. లేకపోతే మీరు నా మెడలో తాళి కడు తూంటే కిక్కురుమనకుండా పడిఉన్నాను, ఎందుక వెర్రికేకలు వెయ్యలేదు. నా జీవితం నాశనమై పోయిందని రోదించలేదు ఎందుకు?

మీకూ సూరిబాబుకీ తేడా మూణ్ణాల ముచ్చటలో స్పష్టంగా తెలుసుకొన్నాను. మనిషికి ప్రేమ ఎంత అవసరమో.... నేను బాధపడ్డ ప్రతి క్షణంలోనూ గుర్తు తెచ్చుకొన్నాను.

సూరిబాబుని ప్రేమించిన విషయాన్ని మీరు ప్రశ్నిస్తే నిర్మలమైన హృదయంతో మొదట్లోనే చెప్పాను. మీరు నమ్ముతారను కొన్నాను. అలా చేస్తే మీలో ప్రత్యేకతే ముంది. చిలవలు వలవలు కొమ్మలు వేళ్ళు కలిపించి నా కథకి కళంకాన్ని ఆతికింప జూచారు.

ఎక్కడికైనా వెళ్ళి తిరిగివస్తే మండి పడేవారు. "నేను వచ్చేటప్పటికి యింట్లో ఉండాలని ఎన్నిసార్లు చెప్పాను. ఇంత సేపు ఏం చేస్తున్నావు? సూరిబాబు కొంపలో కులుకుతున్నావా? నీకు బిడ్డలు వాడివల్ల కావాలో నా వల్ల కావాలో తొందరగా తేల్చుకో........" అని యింకా ఏవేవో చాలా అసహ్యంగా మాట్లాడేవారు. జవా బివ్వడానికి ప్రయత్నిస్తే లెంపలు వాయించే వారు. తలుపు ఆలస్యంగా తీస్తే "ఏం యింతసేపూ ఏం చేస్తున్నావ్ లోపల? సూరిబాబుని దొడ్డి గుమ్మంలో సాగనంపు తున్నావా? ఏమిటి చీర అలా నలిగి వుంది. జుట్టు పీకినట్టుంది. అనుమానం రాకుండా జాగ్రత్త పడ్డంకూడా తెలీదు. దరిద్రగొట్టు మొహం, అవతలకి పో" అనేవారు.

మీరు చాలా మాటలతో నరకయాతన పెట్టేవారు. నానా హింసలు చేసేవారు. అన్నీ పూసగుచ్చి వ్రాసి మీకు గుర్తుచెయ్యా లని లేదు. ఎందుకంటే ఈ ఉత్తరం మీరు తప్ప ఎవరైనా చదివితే నగుబాటుపాల వుతాను.

అయ్యో మీ పిచ్చి! సూరిబాబు అలాంటి వాడు కాడు. అతని విషయం మీకు తెలీదు. అతనికి పవిత్రత మీద చాలా నమ్మకం. అందుకే అతను ఒంటరివాడుగా మిగిలి పోయాడు. 'పెళ్ళిచేసుకోవా, సూరీ' అని బ్రతిమాలుతూ అడిగితే 'మరో వరలక్ష్మి దొరికే వరకూ ఆగాలి' అంటాడు. అతని నిర్ణయమే వేరు.

పవిత్రత అంటూ అసలు విషయం మర్చిపోయాను కదూ. ఒకసారి ఏం జరి గిందో తెలుసా. నేను ఉద్రేకపడి అతని భుజం మీద రెండు చేతులూ వేశాను.



సూరిబాబు కొత్తగా ఫీలయ్యాడు. నాకే తెలీకుండా నా స్వరం మారిపోయింది. "సూరీ....ఒక్కసారి నన్ను ముద్దుపెట్టుకోవూ, ప్లీజ్" అన్నాను. అయినా అదేం అభ్యర్థన? సూరిబాబు నన్ను గుండెలకి హత్తుకుంటాడేమో అనుకున్నాను. పెదవుల మీద ముద్దూ, మురిపెం చూపిస్తాడనుకున్నాను. ఏవేవో బంగారు లోకాలకి పయనం కట్టిస్తాడేమో అనుకున్నాను.

తేలిగ్గా నవ్వేస్తూ మృదువుగా నన్ను విడిపించుకొని "అవన్నీ యిప్పుడే సాగిస్తే రేపు పెళ్ళయింతర్వాత మనకేంతోస్తుంది. యివన్నీ ఆ క్షణాల కోసం దాచుకోవాలి. సరేనా?" అన్నాడు.

సూరిబాబు మహాత్ముడనడం లేదు. కానీ అతను మీరనుకున్నంత చరిత్ర హీనుడు కాడు.

నా మీద అనుమానంతో భగభగమండే మీ కౌగిలి నా కక్కర లేదు. ఆ కౌగిట్లో ఇసుమంత ప్రేమ వున్నా మల్లెమొగ్గలా ఒదిగిపోయేదాన్ని. కసి ద్వేషం పేరుకున్న మీ సహవాసంలో నన్ను,ఆత్మని, నా ఎము

కల్ని, నా రక్తాన్ని మోసంతో నాశనం చేసుకోలేను.

ఇన్నాళ్ళూ వరలక్ష్మి అన్నం వండడానికి ఉపయోగపడింది, కళ్ళు మూసుకొని రెండు క్షణాలు ఓపిక పట్టడానికి ఉపయోగపడింది అని సరిపెట్టుకొని తృప్తి పడండి.

మీ అనుమానాలు యిన్నాళ్ళూ వట్టి అనుమానాలే. ఇప్పుడవి నా తిరుగుబాటుతో నిజాలవుతున్నాయి. ఇంత అర్ధరాత్రి సూరిబాబు నిద్రపోతూంటాడు. తట్టి లేపుతాను, అతన్నీ అతని కోరికల్నీ. స్వర్గ సౌధాలు నిర్మించుకోబోతున్నాను. అడ్డుపడితే పునాదుల్లో పాతిపెడ్తాను. జాగ్రత్త.

వరలక్ష్మి"

అసలు తనింక భర్త గురించి ఆలోచించకూడదు. ఎలాగూ తెల్లవారుతుంది. జరిగే గొడవేదో జరుగుతుంది. తను మాత్రం అన్నిటికీ అతీతురాలు. మహా తప్పైతే తీసుకెళ్ళి జైల్లోపడేస్తుంది కానీ, ఏ కోర్టూ తనని బలవంతంగా తీసుకెళ్ళి భర్త పక్కలో పండబెట్టి జోలపాడదు.

సూరిబాబు నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఆ సుషుప్తిని, తన శ్వాసనాళాల్లో గొడవ, గుండెల చప్పుడు ...ఏదీ భంగం చెయ్యలేకపోయింది.

నవ్వుకొని అతని ఎదుర్రొమ్ము మీద తట్టింది వరలక్ష్మి. సూరిబాబు కళ్ళు తెరిచి అదిరిపడ్డాడు. వరలక్ష్మి.... యింతరాత్రి రావడం అతనికి ఆశ్చర్యం కలిగించింది. "వరలక్ష్మి నువ్వా?" అన్నాడు.

"అవును. నీ వరాన్ని. లే! లేచి కూర్చో. నిన్ను ప్రేమిస్తున్నాను."

సూరిబాబు లేచి కూర్చుంటూ, "ఈ వేళ వచ్చావేం వరలక్ష్మీ?" అన్నాడు.

"అలా పూర్తిగా పిలవకు సూరీ. వరం అనో లక్ష్మి అనో పిలు. యిక నుంచి నీదాన్నే కదా" అంది.

సూరిబాబుకి అర్థం కాలేదు.

"రాజశేఖరం నా నీడ భరించలేక పోతున్నాడు. నా శ్వాసను సహించలేక పోతున్నాడు. నువ్వు నన్ను భరిస్తావో లేదో నా కనవసరం. నాకు నువ్వు కావాలి. అందుకే యిలా అర్ధరాత్రి వచ్చేశాను. ఇక నీతోనే ఉంటాను" అంది ఉద్వేగంతో.

సూరిబాబు ఆమె కళ్ళలోకి విపులంగా చూశాడు.

ఆమె నిర్ణయం బలమైనదిగా తిరుగులేనిదిగా తోచింది. అందుకే అంత రాత్రి భుజం నిండుగా పవిట కప్పుకొని ఒంటరిగా వచ్చేసింది.

"వరం. నువ్వు తొందర పడ్తున్నావేమో."

"అవును తొందరపడ్తున్నాను. నీ ఆశ్రయం కోసం. నీతో సహవాసం కోసం."

"అదికాదు వరలక్ష్మి. నువ్వు పూర్తిగా ఏదీ ఆలోచించకుండా వచ్చావేమోనని. మంచీచెడూ మాటవరసకైనా ముందుసంప్రదించకుండా యిలా హఠాత్తుగా రావడం చూస్తుంటే ...ఏదో క్షణికమైన ఉద్రేకం

నిన్నిలాచేయించిందనిపిస్తుంది. ఇది సరైన దారికాదు" అన్నాడు నచ్చజెప్పే ధోరణిలో.

వరలక్ష్మినిట్టూర్చి సరసన తివాచీ మీద కూలబడింది. ఏం మాట్లాడాలో తెలీక తల గడ లాక్కుని మేనువాల్చి ఒక్కక్షణం కళ్ళు మూసుకుంది. మూసుకునే, "సూరీ, మంచీ చెడూ నిర్ణయించుకునే వ్యవధి ఓపిక నాకు లేవు. నా భర్త నన్ను అసహ్యించు కుంటున్నప్పుడు, నేనూ అదే చెయ్యడంలో తప్పులేదు." అన్నది.

"కేవలం ఆ కారణంతో నాతో బ్రత కాలని వచ్చావా?"

"సూరీ నిన్ను ప్రేమించాను. ఆ విష యము మరిచిపోకు."

"అదంతా నీ పెళ్ళిముందు కథ."

"అబద్ధం. నా హృదయంలో చోటు ఎప్పుడూ నీదే. నా గుండెల్లో నువ్వే పుట్టి పెరిగావు. కానీ నా పెళ్ళితో నీకు అన్యాయం జరిగిపోయింది."

"అదీ అబద్ధమే. నాకు అన్యాయం జరి గిందని నువ్వు భావిస్తున్నావు, బాధపడ్తు న్నావు. నిజానికి నా అంత సుఖపడే ప్రాణి ఎవడూ లేడు. పెళ్ళి చేసుకోకుండా ఒంట రిగా ఉన్నానని, నాశనం అంటే అదేనని అనుకుంటే ఏం చెయ్యగలను?"

"సూరీ నన్ను మభ్యపెట్టకు. నీ మేడకు కొత్త వెలుగు తీసుకురావాలని వచ్చాను. మనం ఈ మేడచుట్టూ పాటలుపాడుకుని ఆటలు ఆడుకుందాం. యిక యిలా బరి తెగించి పిచ్చిమొక్కలూ, గడ్డి మొక్కలూ మొలవ్వు. ఇది నందనవనం అవుతుంది నా చేతుల్లో ఈ మేడంతా శుభ్రం చేసి అలంకరిస్తాను. ప్రమిదలు వెలిగించి వెలుగు ముద్దలో యీ యింటిని ముంచేస్తాను. నా మీద విశ్వాసం పెంచుకో" అన్నదామె, ప్రవాహపు వేగంతో మాట్లాడుతూ.

సూరిబాబు అన్నాడు. "వరం, నువ్వు కన్యవై ఉంటే మనసారా ఆహ్వానించే వాణ్ణి. పునాదులు ఉన్న ఒక యింటికి బాధ్యతగల గృహిణివి నువ్వు. నీ ఇంటిని చీకట్లో ముంచుకుని నా ఇంట్లో దీపం పెడతావా? నా ఇంట్లో చీకటి ఉందని ఎవరు చెప్పారు? ఈ చుట్టూ పెరిగిన గడ్డి స్వేచ్ఛకు ప్రతిరూపం, అంతే. అలాగే నాలో నిరాశ వైరాగ్యం పెరిగాయనుకోకు?"

సూరిబాబు గుంభనత్వానికి వరలక్ష్మి ఆశ్చర్యపడింది. లోపల ఎర్రటి నిప్పు ఉన్నా కనబడకుండా దాచుకోడం ఒక్క నివురుకే తెలుసు.

"అయితే నన్నేం చెయ్యమంటావు?" అంది నీరసించిన మనసుతో.

"నీ భర్త దగ్గరికి వెళ్ళిపో."

చూపులు సారించి చురుగ్గా చూసింది, వరలక్ష్మి "అలా చెయ్యలేను."

"ఏం."

"ఆఖరిసారిగా చీటీ వ్రాసివచ్చేసాను. అందులో అంతా తెంపు చేసేసాను. తెల్ల వారిం తర్వాత నా భర్త అది చదివి అంతా తెలుసుకుంటాడు" అంది.

"అందుకే తెల్లవారకుండా చీకట్లోనే



చక్కబెట్ట మంటున్నాను. వెళ్ళిపో" అన్నాడు సూరిబాబు.

వరలక్ష్మికి దుఃఖం ముంచుకొచ్చింది. గొంతుక సంకోచవ్యాకోచాలతో శబ్దించింది. వెక్కిళ్ళు పడి ఏడ్చింది. కొవ్వొత్తి కాంతిలో చెక్కిళ్ళమీద ముత్యాలసరం జాలు వారింది. సూరిబాబు ఆమె దగ్గరగా జరిగి లాలనతో తలనిమిరాడు.


"వరం ఏడుస్తున్నావా?"

"అవును. ఏం చెయ్యను. స్వర్గం తలుపులు మూసేసావు. నాకు ప్రవేశం లేదంటున్నావు."

"వరలక్ష్మి నీకు తెలిసీ తెలియని కట్టుబాట్లు చాలా ఉన్నాయి. దీన్ని లేచిపోవడం అంటారు."

"ఎవరో అంటారు సుఖపడడం తెలియని వాళ్ళు. మన బ్రతుకులు కళ్ళయెదుట నాశనమవుతుంటే చేతకాని వాళ్ళలా ఊరుకుంటామా. మరోదారి వెతుక్కోడం తప్పా?"

"ఉన్నదారి సుగమం చేసుకుంటే ఎంతో తృప్తి ఉంటుంది. చాలా శ్రమ




పడాలి."

"అంత సహనం నాలో లేదు. అదెప్పుడో చచ్చిపోయింది. నేను దిక్కులేని దానిలా నీ శరణుకోరానని అనుకో. నన్ను చేరదియ్యలేవా?"

సూరిబాబు రెండు క్షణాలు మౌనంగా ఉన్నాడు. తరవాత, "వరలక్ష్మి, నా స్వార్థాన్ని బైటపెడ్తున్నాను. నిన్ను భరించడానికి సిద్ధంగా లేను. సగం దారి నడిచాక కొత్త బరువులు నెత్తిన వేసుకోలేను."

ఆమె అచేతనంగా ఉండిపోయింది. విస్ఫారిత నయనాలతో చూసింది.

"సూరీ, నేను నీకు బరువా?"

"అవును" అతను ఖండితంగా చెప్పాడు.

ఆమె లేచి నిలబడింది.

"నా నరకానికి తిరిగి వెళ్ళిపోతున్నాను. దిక్కుమాలిన స్థితిలో నీ ప్రేయసివస్తే మూర్ఖంగా ఏవో నెపాలు చెబుతున్నావు. కళ్ళుమూసుకు బ్రతకడం నేర్చుకుంటాను. బ్రతికున్నన్నాళ్ళూ ఈ రాత్రినీ, నిన్నూ గుర్తుంచుకుంటాను" అనేసి చరచరా వెళ్ళిపోయింది. మెట్లు దిగి వేగంగా వెళ్ళిపోతూంటే వెక్కిళ్ళు వినిపించాయి.

సూరిబాబు నిట్టూర్చి తలగడలో తల దూర్చాడు. తను నిష్ఠురపడినా అందులో ఏదో ప్రయోజనం ఆశించే కఠినత్వాన్ని కొనితెచ్చుకున్నాడు. ఆ తృప్తి చాలు.

రాత్రి సుమారు రెండున్నర గంటలవుతుంది. పడక గదిలో కాలుపెట్టి స్థాణువు అయిపోయింది వరలక్ష్మి. పరుపుమీద భర్త లేడు. ఏంచేయాలో తోచలేదామెకు. రాజశేఖరం యింత అపరాత్రి ఏమైనట్టు? ఎక్కడికి వెళ్ళినట్టు.........తను ఎక్కడికి వెళ్ళిందో అతను కూడా అలాగే ఎక్కడికో వెళ్ళినట్టా? అటువంటి ఆలోచన రాకూడదనుకుంది. రకరకాల అనుమానాలొచ్చాయి.

గబగబా మంచం దగ్గరకు పరుగెత్తి వెతికి చూసింది. తను వ్రాసిన ఉత్తరం కనుపించలేదు. తల దిమ్మెక్కి పోయింది గుప్పెళ్ళతో దుప్పటి పుచ్చుకుని కూలబడి పోయింది. అది భర్త చదివి ఉంటాడు. అంతా అయిపోయి ఉంటుంది. రాపిపెట్టిన ఖర్మ అనుభవించక తను యెందుకలా ఇంట్లోంచి వెళ్ళిపోయింది? తను అనుకున్నది జరగనప్పుడు ఏ నూతిలోనో గోతిలోనో తలదాచుకోక తిరిగి ఈ గడప ఎలా తొక్కినట్టు?

టీపాయ్ మీద ఫోన్ మోతలకి తేరుకొంది వరలక్ష్మి. చెవిదగ్గర పెట్టుకుంది యాంత్రికంగా.

"హలో ఎవరూ? ప ని మ ని షి సుబ్బయ్యా ఎవరు మాట్లాడేది ..."

ఉలిక్కిపడింది వరలక్ష్మి. అది భర్త కంఠం. గొంతు పెగల్చుకుని అంది "నేనండి వరలక్ష్మిని. ఎక్కడున్నారు?"

"వాట్ వరలక్ష్మివా? యింకా లేచి పోలేదా? లేక మధ్యలో కాళ్ళు లాగి తిరిగొచ్చావా?"

వరలక్ష్మి మాట్లాడలేదు. ఆపుకొందామన్నా ఏడు పొచ్చింది. అది అవతల రాజశేఖరానికి వినబడి తీరుతుంది.

"వెరీ సారీ భార్యగారూ ...నిద్రలో మెలకువ వచ్చి చెయ్యి చాచితే నీ శరీరం తగలలేదు. లేచి చూస్తే లెటర్ ఉంది నువ్వు లేవు. అది చదివి నీ క్షేమసమాచారాల్ని కార్యక్రమాన్ని తెలుసుకున్నాను. చెయ్యి చాచితే స్త్రీ శరీరం తగలాల్సిన అవసరం చాలా తొందర కలిగించింది . అందుకే యిక్కడ "

వరలక్ష్మి అనుభూతి రహితంగా వింటోంది. ఏ సంచలనం కలుగలేదు ఆమెలో.

"ఆ! రేపు నా స్వర్గాన్ని మన ఇంట్లోకి మార్చాలనుకుంటున్నాను. నువ్వక్కడ వుంటేబావుండదేమో. నీఉత్తరంలో ఆఖరి మాటలు గుర్తు చేస్తున్నాను. 'నే నా స్వర్గసౌధాలు నిర్మించుకోబోతున్నాను. అడ్డువస్తే పునాదుల్లో పాతిపెడతాను. జాగ్రత్త ..'

యింకా ఏవేవో అంటున్నాడు. వరలక్ష్మి భర్తకి చెప్పాలనుకుంది తను చాలా పొరబాటు చేశానని. జరిగింది మర్చిపొమ్మని. కానీ ఎంత అసహజమైన అభ్యర్థన? మామూలు పరిస్థితుల్లోనే అర్థం చేసుకోలేని భర్త నిజంగా ద్రోహం తలపెట్టినప్పుడు మాట వింటాడా, క్షమిస్తాడా? సగం చంపుకున్న వరలక్ష్మికి పూర్తిగా చంపుకోడం చేతకాలేదు.

ఇంకా అతని మాటలు వినిపిస్తూనే ఉన్నాయి.....ఇప్పుడేదో చెయ్యాలి. అదే ఫోన్ పెట్టెయ్యడం. అలా చేసింది. అతని మాటల ప్రవాహం తెగిపోయింది.

నీరసంగా టీ పాయ్ మీద నుదురాన్చి గచ్చుమీద కూర్చుండి పోయింది వరలక్ష్మి.